సాక్షి విశాఖపట్నం

శనివారం : 4 : జనవరి : 2025

నేవీడే విన్యాసాలు



- వేడుకలకు సర్వం సిద్ధం
- సీటింగ్‌కు ప్రత్యేక పాస్‌లు మంజూరు
- బీచ్‌రోడ్డులో పటిష్ట భద్రత
- వీక్షకులకు ఉపయుక్తంగా ఎల్‌ఈడీల ఏర్పాటు



కూర్చునేందుకు వీలుగా ఇసుకలో వేసిన గ్రీన్‌మ్యాట్

ఏయూక్యాంపస్: నావికాదళ విన్యాసాలకు బీచ్ రోడ్డు సర్వాంగ సుందరంగా సిద్ధమవుతోంది. శనివారం సాయంత్రం విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా జరగనున్న నావికాదళ విన్యాసాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భారీ సంఖ్యలో సందర్శకులు వచ్చినా వీక్షించేందుకు వీలుగా నేవీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆర్‌కే బీచ్ నుంచి పోలీస్‌మెస్ వరకు తీరంలో భారీగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. సందర్శకులు సాగర తీరంలో కూర్చుని ఎల్‌ఈడీ తెరలపై వేడుకలు వీక్షించవచ్చు. ప్రధాన వేదికకు రెండు వైపులా సీటింగ్, ఇసుక తిన్నెలపై సైతం కుర్చీలు వేసి సీటింగ్ సదుపాయం కల్పించారు. వీటికి ప్రత్యేక పాస్‌లను జారీ చేశారు. సిల్వర్‌స్పూన్ రెస్టారెంట్ నుంచి పోలీస్ మెస్ వరకు ఉన్న ఇసుక తిన్నెలచుట్టూ కేవలం ఫెన్సింగ్ వేశారు. నావికా విన్యాసాలు ప్రారంభమయ్యే సమయానికి గంట ముందుగానే ప్రజలు ప్రాంగణానికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నావికా విన్యాసాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రులు హాజరవుతున్న నేపథ్యంలో పోలీసులు, జీవీఎంసీ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. శనివారం మధ్యాహ్నం నుంచి బీచ్‌రోడ్డులోకి వాహనాలను అనుమతించరు. వీక్షకులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మైదానాలలో తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి. సాయంత్రం 4.40 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ విన్యాసాలు జరుగుతాయి.

ప్రత్యేక ఆకర్షణగా లేజర్ షో

కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న లేజర్ షో, డ్రోన్ షోలు మరింత కొత్తదనాన్ని తీసుకువస్తున్నాయి. నావికాదళ సిబ్బంది సంగీత బృందం బీటింగ్ రిట్రీట్, తుపాకులతో చేసే కవాతు వారి క్రమశిక్షణ, ఏకాగ్రతలకు ప్రతీకగా నిలుస్తాయి. పెద్దసంఖ్యలో నావికాదళ ఉన్నతాధికారులు, సిబ్బందితో పాటు, నగరవాసులు ఈ విన్యాసాలను తిలకించడానికి రానున్నారు. గతంలో కంటే విస్తృత స్థాయిలో దీనికోసం నావికాదళం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. నేవీ విన్యాసాల్లో యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు, హెలీకాప్టర్లు, ఫైటర్ జెట్‌లు, సబ్ మెరైన్‌లు భాగం కానున్నాయి. నావికాదళానికి వెన్నెముకగా నిలిచే మెరైన్ కమాండోల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. భారత నావికాదళ సిబ్బంది ధైర్యం, సాహసాలను ప్రజలకు కళ్లకు కట్టినట్టు చూపే విధంగా ఈ కార్యక్రమం జరగనుంది. ఇప్పటికే జరిగిన రెండు నమూనా విన్యాసాలు విజయవంతమయ్యాయి.



వీక్షకుల గ్యాలరీలో ఏర్పాటు చేసిన కుర్చీలు

ఇక్కడంతా నీడలే మాట్లాడతాయి...!

షాడోలే అసలైన హీరోలు



- ఎమ్మెల్యే కలెక్షన్ కింగ్‌లంతా వీరే...
- కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రధాన అనుచరులదే హవా
- ఏ పని కావాలన్నా వీరు తలూపాల్సిందే...
- పోస్టింగుల నుంచి పైరవీలదాకా అంతా వీరి కనుసన్నల్లోనే...

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేల నడకను నీడలే శాసిస్తున్నాయి. ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి ఏ పని చేయాలో...ఏ పోస్టుకు ఎవరిని సిఫారసు చేయాలో.. ఏ పని ఎవరికి అప్పగించాలో అంతా వీరే నిర్ణయిస్తున్నారు. నీడను కూడా నమ్మకూడదనేది పాత సామెత. అంతా నీడను నమ్మి... వారు చెప్పినట్టే చేయాలనేది కూటమి ఎమ్మెల్యేల బాట. కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేల్లో ఎవరి దారి వారిదే. ఒకరు సొంత కుటుంబ సభ్యులను షాడోలుగా పెట్టుకుని పనులు నడుపుతుంటే... మరొకరు బంధువులు, ప్రధాన అనుచరులతో పనులు కానిస్తున్నారు. తమ చేతికి నేరుగా మట్టి అంటుకోకుండా అవినీతి వ్యవహారాలను గుట్టుగా చక్కబెడుతున్నారు. కొద్ది మంది ఎమ్మెల్యేలకు ఏకంగా ఐదు నుంచి పది మంది వరకూ షాడోలుగా వ్యవహరిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. కొందరు కేవలం సొంత కుటుంబ సభ్యులతో మాత్రమే పనులు చక్కబెట్టుకుంటున్నారు. మరి కొందరు తమ ప్రధాన అనుచరులను నమ్ముకుని జేబులు నింపుకుంటుండగా.... ఆరోపణలు వచ్చిన వెంటనే తనకు తెలియకుండా చేశాడని అధిష్టానానికి వివరణ ఇస్తూ పక్కన పెట్టినట్టు నటిస్తున్నారు. మొత్తంగా కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేల్లో మెజారిటీ సభ్యుల నీడలే వ్యవహారాలన్నీ నడుపుతుండటం గమనార్హం.

పెత్తనమంతా వారిదే...!

విశాఖ జిల్లాలోని ఒక్కో ఎమ్మెల్యేది ఒక్కో తీరు. కూటమిలోని ఒక ఎమ్మెల్యే పైకి నిజాయితీపరుడిగా నటిస్తూ.... వ్యవహారాలను మాత్రం ఆయన కుటుంబ సభ్యుల ద్వారా కానిస్తున్నారు. ఆయన లేని సమయంలో ఆయన కుటుంబంలోని వ్యక్తి ప్రారంభోత్సవాలు, సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఇక పలు మార్లు ఎమ్మెల్యేగా గెలిచి... నియోజకవర్గమంతా కొట్టినపిండి మాదిరిగా ఉన్నప్పటికీ... ఆయన లేని సమయంలో ఆయన అనుచరుడు అధికారులపై కేకలు వేస్తూ పనిచేస్తున్నారు. అధిష్టానం నుంచి ఆయనపై ఏ మాత్రం సానుకూల దృక్పథం లేకపోవడంతో దూకుడు తగ్గించిన సదరు ఎమ్మెల్యే.... ఆయన షాడో మాత్రం ఎక్కడా తగ్గేదేలే అంటూ దబాయించి మరీ పనులు చేయిస్తుండటం గమనార్హం. ఇక నగరంలో కూటమిలోని ఓ ఎమ్మెల్యే మాత్రం అంతా పెదరాయుడు టు ధనుష్... ధనుష్ టు పెదరాయుడు అన్నట్లుగా నేరుగా వ్యవహారాలను చక్కబెట్టుకుంటున్నారు. ఎప్పుడూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండడనే పేరున్న ఓ ఎమ్మెల్యేకు కుటుంబంలోని ఐదు మంది షాడోలుగా వ్యవహరిస్తున్నారు. సతీమణి, కుమారుడు, అల్లుడు, మేనల్లుడు, బావమరిదితో పెత్తనమంతా సాగుతుండటం ఆయన వద్దకు వచ్చే అందరికీ తెలిసిన విషయమే. మంత్రి పదవి ఆశిస్తున్న మరో ఎమ్మెల్యేకు మాత్రం పోలీసు పోస్టింగుల్లో భార్య తరపు బంధువు (బావమరిది) ఒకరు భారీగా దండుకోవడంతో విమర్శలు వచ్చాయి. దీంతో తాత్కాలికంగా పక్కన పెట్టినట్టు ప్రచారం చేశారు. వసూళ్లన్నీ ఎమ్మెల్యే జేబులోకి చేరడంతో నియోజకవర్గంలో కనపడకుండా... కేవలం ఇంటికి మాత్రమే వచ్చేలా చూసుకుంటున్నారు. ఇక జీవీఎంసీలోని వ్యవహారాలన్నీ ఇద్దరు కార్పొరేటర్ల ద్వారా ఆయన చూసుకుంటున్నట్టు తెలుస్తోంది.

మండలానికి ఒకరు...!

అనకాపల్లి జిల్లాలోనూ ఎమ్మెల్యేలదీ ఒక్కొక్కరిది ఒక్కో స్టైయిల్. ఇప్పటికే జనసేన అధిష్టానం నుంచి భారీగా విమర్శలు ఎదుర్కొని క్లాసులు పీకుతున్నా.... అస్సలు తగ్గేదేలే అని ఆయన రెచ్చిపోతున్నారు. ఆయన అవినీతి దూకుడుకు ఎవ్వరూ ఆనడం లేదు. ఆయన సోదరుడి అండతో అందినకాడికి దోచుకుంటున్నారు. పరిశ్రమల నుంచి పోస్టింగుల వరకూ... నేవీ నుంచి నరేగా నిధుల వరకూ ఆయనకు అడ్డులేకుండా పోయింది. ఇక మరో ఎమ్మెల్యే నియోజకవర్గంలోని మండలానికో వ్యక్తిని షాడోగా మార్చుకున్నారు. అక్కడ కొత్తగా వెంచర్ వేయాలన్నా.... నిర్మాణాలు చేపట్టాలన్నా వీరి నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. ఈయనకు నియోజకవర్గమంతా మొత్తం 10 మంది వరకూ షాడోలుగా వ్యవహరిస్తున్నారు. మరో ఎమ్మెల్యే వ్యవహారాలన్నీ సతీమణితో పాటు కుమారులు చూసుకుంటుండగా... ఇంకో ఎమ్మెల్యే పెత్తనమంతా కుమారుడే దగ్గరుండీ మరీ చక్కబెడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటికీ నుంచి పెద్దగా ఎక్కడా హడావుడి చేయకపోయినప్పటికీ సదరు ఎమ్మెల్యే అల్లుడు మాత్రం ఆర్థిక వ్యవహారాల్లో చక్రం తిప్పుతున్నారు. ఇదే జిల్లాలోని ఒకరు మాత్రం నిత్యం వార్తల్లో ఉంటున్నారు. సదరు ఎమ్మెల్యే అనుచరులు ఇప్పటికే భూకబ్జాలు, పోస్టింగుల్లో భారీగా వసూళ్లకు తెగబడటంతో అధిష్టానం దాకా విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో అప్పటివరకు అన్ని వ్యవహారాలను చక్కబెట్టిన సదరు వ్యక్తి తనకు తెలియకుండా చేశాడంటూ దూరం పెడుతున్నట్టు సర్దిచెప్పుకున్నారు. ఈ ఎమ్మెల్యేకు నియోజకవర్గంలోని మండలానికి ఇద్దరు ముగ్గురు షాడోలుగా రెచ్చిపోతున్నారు.

ఎమ్మెల్యే భర్తదే పెత్తనం

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఒక నియోజకవర్గంలో ఎమ్మెల్యే భర్తదే మొత్తం పెత్తనమంతా నడుస్తోంది. ఏ పోస్టింగు కావాలన్నా... ఆయన ఓకే అనాల్సిందే. ఇప్పటికే అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు వ్యక్తి... ఎన్ని ఆరోపణలు వచ్చినా ముందుకేనంటూ నీడగా సాగుతున్నారు. ఒక నియోజకవర్గ ఇంచార్జికి గతంలో పీఏగా వ్యవహరించిన వ్యక్తి ఇప్పటికీ వెనుక నుంచి కథ మొత్తం నడిపిస్తున్నట్టు విమర్శలున్నాయి.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు 35 శాతం జీతాల చెల్లింపు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఉద్యోగులకు నవంబర్ నెలకు సంబంధించి శుక్రవారం కేవలం 35 శాతం జీతం చెల్లించింది. సంక్రాంతి పండగ నేపథ్యంలో కేవలం 35 శాతం జీతం చెల్లించడంపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సెప్టెంబర్ జీతం 50 శాతం, అక్టోబర్ జీతం 35 శాతం, నవంబర్ పూర్తి జీతం పెండింగ్ పెట్టింది. డిసెంబర్ నెల పూర్తి జీతంతో మొత్తం 285 శాతం జీతం పెండింగ్‌లో పెట్టింది. గత నెలలో పూర్తి జీతం ఇవ్వకపోవడంతో ఉద్యోగులు ఈ నెలైనా మొత్తం జీతం ఇస్తారని ఆశించగా నవంబర్ నెలకు సంబంధించి కేవలం 35 శాతం ఇవ్వడంపై తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం

విశాఖ విద్య: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు శనివారం నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతుందని జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషనల్ అధికారిణి బి. రాధ తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఇతర ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో పెదగంట్యాడ మండలం అగనంపూడి జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. జిల్లాలో 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో ఈ కార్యక్రమం అమలు జరగనుందని పేర్కొన్నారు.

కూటమి మాటలు నమ్మి మోసపోయాం

- వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దీప్తి
- జీవీఎంసీ గాంధీ బొమ్మ వద్ద ధర్నా
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు



ధర్నా చేస్తున్న వలంటీర్లు

సీతమ్మధార : 'నమ్మించి మోసం చేశారు. కూటమి హామీలు నమ్మి వీధిన పడ్డాం. ఇంత దారుణం ఎప్పుడూ చూడలేదు..మాట ఇస్తే నిలుపుకోవాలి. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకోకూడదు' అంటూ వలంటీర్లు కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. అధికారంలోకి వస్తే వార్డు వలంటీర్లకు రూ.10వేలు చొప్పున ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చాక తమను పట్టించుకోవడం మానేశారని ఏపీ ప్రజా గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశాఖ జిల్లా అధ్యక్షురాలు దీప్తి పేర్కొన్నారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రంలో 2.60 లక్షల మంది వలంటీర్లను నియమించిందని గుర్తు చేశారు. ఎన్నికల ముందు రాజీనామాలు చేశాక వీరి సంఖ్య 1.50వేల మంది మిగిలారని గుర్తు చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో దాదాపుగా 14 వేల మంది వరకు వలంటీర్లు ఉన్నారని తెలిపారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గౌరవ వేతనం కింద రూ.5000 క్రమం తప్పకుండా ఇచ్చిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా వేతనాలు ఇవ్వడం లేదని, తమను పూర్తిగా పక్కన పెట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందని మండిపడ్డారు. మహిళలను గౌరవిస్తామని చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ..వలంటీర్లుగా 50 శాతం మంది మహిళలే పనిచేస్తుంటే ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.మణి మాట్లాడుతూ సావిత్రిభాయి పూలే స్ఫూర్తితో పోరాటం సాగిస్తామన్నారు. ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు కావస్తున్నా వలంటీర్లను విధుల్లోకి తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కే.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే స్పందించి వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సీఎం డౌన్ ...డౌన్..డిప్యూటీ సీఎం డౌన్ డౌన్‌అంటూ పెద్ద ఎత్తున వలంటీర్లు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రెండో పట్టణ పోలీసులు, స్పెషల్‌బ్రాంచ్, ఇంటెలిజెన్స్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. శనివారం కూడా ధర్నా కొనసాగిస్తామని వలంటీర్లు పేర్కొన్నారు.

మాట నిలుపుకోవాలి



కూటమి అధికారంలోకి వస్తే వేతనాలు రూ.5వేల నుంచి రూ.10 వేలుకు పెంచుతామని హామీ ఇచ్చారు. రూ.10వేల సంగతి దేవుడెరుగు, అసలు ఉద్యోగం ఇస్తే అదే పది వేలు అన్నట్టుగా ఉంది. వలంటీర్లను కొనసాగించి, కూటమి నేతలు ఇచ్చిన మాట ప్రకారం రూ.10వేల వేతనాలు ఇవ్వాలి.

– లక్ష్మణ్, వార్డు వలంటీర్, గాజువాక.

చంద్రబాబు మోసం చేశారు



కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలవుతున్నా వార్డు, గ్రామ వలంటీర్లను కొనసాగించకుండా చంద్రబాబు అన్యాయం చేశారు. వేతనాలు రూ.10వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ నెరవేర్చలేదు. పండక్కి పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది.

– దీప్తి, విశాఖ జిల్లా అధ్యక్షురాలు

మహిళా వలంటీర్ల అవస్థలు



రాష్ట్రంలోని వలంటీర్లలో సగానికి పైగా మహిళలే ఉన్నారు. వీరిలో దివ్యాంగులు కూడా పనిచేస్తున్నారు. ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు కావస్తున్నా వలంటీర్లను విధుల్లోకి తీసుకోలేదు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.10వేల వేతనాలు కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వలంటీర్లను విధుల్లోకి తీసుకుని, రూ. 10 వేలు వేతనాలు ఇవ్వాలి.

– లైలా , దివ్యాంగ వలంటీర్, పెందుర్తి

ప్రధాని పర్యటనకు ఏర్పాట్లు




సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాల వీరాంజనేయ స్వామి

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో ఈ నెల 8న జరిగే ప్రధాని మోదీ పర్యటన విజయవంతమయ్యేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఆదేశించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సీఎం కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్‌తో కలిసి కలెక్టరేట్‌లో అధికారులు, ప్రజా ప్రతినిధులతో శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక ప్రధాని మొదటిసారిగా రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సుమారు రెండు లక్షల మంది ప్రజలు కార్యక్రమానికి హాజరుకానున్నారన్నారు. మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయంతో పాటు పార్కింగ్‌కు సంబంధించిన నిబంధనలను ఆయా జిల్లాలకు ముందుగానే సమాచారం తెలపాలని ఆదేశించారు. ప్రధాన వేదిక వద్ద, రోడ్ షో జరిగే ప్రాంతాల్లో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు.

ప్రధాని పర్యటన నేపథ్యంలో మంత్రుల కమిటీని నియమించామని, ఆదివారం ఈ బృందం జిల్లాలో పర్యటించి ఏర్పాట్లను సమీక్షిస్తుందని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, ప్రభుత్వ విప్‌లు గణబాబు, వేపాడ చిరంజీవి రావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఎమ్మెల్యేలు వెలగపూడి, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లపై దిశానిర్దేశం



సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్

మహారాణిపేట: ప్రధాని విశాఖ పర్యటన నేపథ్యంలో రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని పర్యటనకు భారీగా ప్రజలు తరలిరానున్నారన్నారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ నగరంలో 22 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం పూడిమడకలో ఎన్.టి.పి.సి.ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. కృష్ణపట్నం ఇండస్ట్రియల్ హబ్‌ను కూడా ప్రధాన మంత్రి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. నక్కపల్లిలో 2001.8 ఎకరాల విస్తీర్ణంలో రూ.1876.66 కోట్లతో ఏర్పాటు చేసే బల్క్ డ్రగ్ పార్కును వర్చువల్‌గా శంకు స్థాపన చేయనున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

డాబాగార్డెన్స్: నేవీ విన్యాసాలకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం విశాఖ వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ పరిశీలించారు. ఆర్కే బీచ్ తదితర ప్రాంతాల్లో పలు విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఈ నెల 8న విశాఖలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించనున్న నేపథ్యంలో ఏయూ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లు పరిశీలించారు. ఏయూ గ్రౌండ్‌లో జరిగే ప్రధాని సభకు దాదాపు రెండు లక్షల మంది ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున వారికి మౌలిక సదుపాయాలు కల్పించనున్నామన్నారు.

పటిష్ట భద్రత



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పీఎం పర్యటన నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లపై చర్చించారు. బందోబస్తుకు అవసరమైన అధికారులు, సిబ్బందిని ఇతర జిల్లాల నుంచి రప్పించాలని నిర్ణయించారు.ఆర్మ్‌డ్ రిజర్వు సిబ్బందితో పికెట్స్ ఏర్పాటుతో పాటు చెక్‌పోస్టులు, రోప్ పార్టీలతో నగరమంతా పటిష్ట భద్రత ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బాంబ్ డిస్పోజల్ సిబ్బంది, ఏఎస్సీ, ఆర్‌టీపీ, స్నిఫర్ డాగ్ బృందాలతో నగరమంతా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. మోటార్ ట్రాన్స్‌పోర్ట్ సిబ్బందిని కాన్వాయ్‌లకు, వీఐపీ వాహనాలకు వినియోగించాలని సూచించారు. గ్రేహౌండ్స్, ఏపీఎస్పీ, ఆక్టోపస్ సిబ్బందితో ఏరియా డామినేషన్, ఎమర్జెన్సీ, క్విక్ రియాక్షన్ టీం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

జైలులో 'సెల్'చల్

- కలకలం రేపుతున్న సెల్‌ఫోన్ల లభ్యత
- జైలుకు ఎలా చేరుతున్నాయో ప్రశ్నార్థకం
- తలలు పట్టుకుంటున్న అధికారులు
- జైల్ సిబ్బందిపై అనుమానం

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్లు కలకలం రేపుతున్నాయి. జైల్ బ్యారక్‌లలో వరుసగా సెల్ ఫోన్‌లు బయటపడుతుండటంతో అధికారులు కంగుతింటున్నారు. నిషేధించిన వస్తువులు జైల్ లోపలకు ఎలా చేరుతున్నాయో అంతుచిక్కక కొత్తగా వచ్చిన అధికారులు తలలు పట్టుకొంటున్నారు. శుక్రవారం ఓ సెల్ ఫోన్ లభించింది. నాలుగు రోజుల కిందట రెండు సెల్ ఫోన్‌లు దొరికిన విషయం తెలిసిందే. నాలుగు రోజుల వ్యవధిలోనే రెండు బ్యారక్‌లలో మూడు సెల్ ఫోన్‌లు దొరకడంతో ఇంకెన్ని సెల్ ఫోన్‌లు ఎక్కడెక్కడ ఉన్నాయో అని అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. తనిఖీల్లో భాగంగా శుక్రవారం నర్మదా బ్యారక్‌ను పరిశీలించినట్లు జైల్ సూపరింటెండెంట్ ఎం. మహేష్‌బాబు తెలిపారు. ఈ తనిఖీలలో ఆ బ్యారక్ స్టోర్ రూం మెట్ల కింద గచ్చులో చేసిన రంధ్రంలో ఓ డబుల్ సిమ్ సెల్ ఫోన్ దొరికినట్లు తెలిపారు. దాన్ని స్వాధీనం చేసుకుని ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. గత నెల 31న రెండు సెల్ ఫోన్‌లు, ప్రస్తుతం దొరికిన సెల్ ఫోన్లపై ఆరిలోవ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

ఎవరు వినియోగిస్తున్నారు..?

విశాఖ కేంద్ర కారాగారంలో ఏ ఖైదీలు సెల్ ఫోన్‌లు వినియోగిస్తున్నారో అనే దానిపై జైల్ అధికారులు, ఆరిలోవ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇంత కట్టుదిట్టమైన రక్షణ వలయంను ఛేదించుకుని సెల్ ఫోన్‌లను జైల్ లోపలకు ఎవరు అందిస్తున్నారో అనేది అంతుచిక్కడంలేదంటూ అధికారులు అంటున్నారు. జైల్‌సిబ్బంది ప్రమేయంతోనే సెల్ ఫోన్‌లు లోపలకు వెళుతున్నాయని భావిస్తున్నారు. గత ఏడాది డిసెంబర్ 31న పెన్నా బ్యారక్‌లో రెండు సెల్ ఫోన్‌లు, ఒక పవర్ బ్యాంక్, ఒక కీ ప్యాడ్ ఫోన్,



జైల్ నర్మదా బ్యారక్‌లో అధికారులకు దొరికిన సెల్

రెండు కేబుళ్లు బయటపడ్డాయి. వాటిని మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడు, రౌడీ షీటర్ కోలా హేమంతకుమార్, మరో రౌడీషీటర్ రాజేష్ వినియోగించినవిగా జైల్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వారిరువురిపైనా సెల్ ఫోన్‌లు వినియోగిస్తున్నట్లు అనుమానం ఉన్నట్లు పేర్కొన్నామని సూపరింటెండెంట్ మహేష్ బాబు తెలిపారు. శుక్రవారం బయటపడిన సెల్ ఫోన్ ఎవరు ఉపయోగించారో, దాన్ని ఎవరు లోపలకు తీసుకొచ్చారో తేలాల్సి ఉంది.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సేవలు కొనసాగించాలి

మేయర్, జీవీఎంసీ కమిషనర్‌కు **వినతి**



మేయర్ హరి వెంకటకుమారికి వినతిపత్రం అందజేస్తున్న బానాల శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్: పబ్లిక్ హెల్త్ విభాగంలో అవుట్ సోర్సింగ్ వర్కర్ల సేవలను మరో రెండేళ్ల పాటు కొనసాగించాలని జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రాలు సమర్పించారు. 60 ఏళ్ల వయసు పూర్తయినందన్న కారణంతో జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ విభాగంలో పనిచేస్తున్న 200 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సేవలను నిలిపివేశారన్నారు. కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో వీరంతా అంకితభావంతో సేవలు అందించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఏనాడూ వర్కర్లను తొలగించలేదని, ఉద్యోగుల మేలు కోరి రిటైర్‌మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచారని గుర్తు చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవలను గుర్తించి, వారికి కూడా 62 ఏళ్ల పదవీ విరమణ వయసును వర్తింపజేయాలని కోరారు. దీని ద్వారా వారి కుటుంబాలకు రక్షణ కల్పించవచ్చన్నారు. పదవీ విరమణ చేసిన వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్లియరెన్స్‌కు 31 వరకు గడువు

- పూర్తి వివరాలు సమర్పించి సహకరించండి
- 2,111 మందికి వీఎంఆర్డీఏ కమిషనర్ పిలుపు

మద్దిలపాలెం: లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్‌ఆర్‌ఎస్)-2020 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల క్లియరెన్స్‌కు ఈ నెల 31 వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందని వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఓ ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మెమో జారీ చేసిందన్నారు. చెల్లింపులు, పత్రాల సమర్పణకు సంబంధించి వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఈ మేరకు కమిషనర్ అధికారులను ఆదేశించారు. నిర్దిష్ట గడువులోగా వాటిని పరిష్కరించాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ పథకం ద్వారా గతంలో వీఎంఆర్డీఏకు 5,803 దరఖాస్తులు వచ్చాయని కమిషనర్ వెల్లడించారు. వీటిలో 2,942 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయగా, 615 దరఖాస్తులు తిరస్కరించినట్లు చెప్పారు. 127 దరఖాస్తుదారులకు చెల్లింపు నోటీసులు జారీ చేశామని, పూర్తి సమాచారం లేదని 2,111 మంది దరఖాస్తుదారులకు తెలియజేశామన్నారు. షార్ట్‌ఫాల్స్ ఉన్న దరఖాస్తుదారులు వీలైనంత త్వరగా సంబంధిత పత్రాలను వీఎంఆర్డీఏకు సమర్పించి, దరఖాస్తుల క్లియరెన్స్‌లో సహకరించాలని కమిషనర్ కోరారు.

చిట్టి మెదళ్లు.. పెద్ద ఆలోచనలు

ఆలోచింపజేసిన వైజ్ఞానిక ప్రదర్శన

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థుల ప్రతిభకు పట్టం కట్టింది. 11 మండలాల నుంచి ఎంపిక చేసిన 33 ప్రాజెక్టులను ఇక్కడ ప్రదర్శించారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ప్రదర్శనను ప్రారంభించి విద్యార్థులు చేసిన నృత్యాలను తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జిల్లా విద్యార్థులు విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. డీఈవో ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రవేత్తలుగా మారడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు బాటలు వేస్తాయన్నారు. గత నెల 30న పాఠశాల స్థాయిలో, 31న మండల స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేసి విజేతలతో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమమైన ఆరు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశామన్నారు. ఇందులో విద్యార్థుల వ్యక్తిగత ప్రదర్శనలు రెండు, గ్రూపు ప్రదర్శనలు



ఎమ్మెల్యే వెలగపూడి, డీఈవో ప్రేమ్‌కుమార్‌కు ప్రాజెక్ట్ గురించి వివరిస్తున్న విద్యార్థులు

రెండు, ఉపాధ్యాయులు రూపొందించిన రెండు ప్రాజెక్టులు ఉన్నాయని వెల్లడించారు. విద్యాశాఖాధికారులు, హెచ్‌ఎంలు గంగాభవాని, పైడిరాజు, కృష్ణకుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు ఇవే..

వ్యక్తిగత విభాగంలో పెందుర్తి ఉన్నత పాఠశాల నుంచి మల్టీ పర్పస్ అగ్రికల్చర్ రోబోట్, శ్రీకృష్ణాపురం గురుకుల నుంచి యూజ్ ఆఫ్ మ్యాథమెటికల్ మోడలింగ్ ఫర్ స్వచ్ఛ భారత్, గ్రూపు విభాగంలో నడుపూరు ఉన్నత పాఠశాల నుంచి యాంటీ స్లీప్ అలారం, మేహాద్రి గెడ్డ బాలికల గురుకులం నుంచి ఆటోమేటిక్ సేఫ్టీ మానిటరింగ్ అండ్ ప్రివెన్సివ్ సిస్టమ్, ఉపాధ్యాయ విభాగంలో శ్రీకృష్ణాపురం గురుకులం నుంచి ఆటోమేటిక్ ట్రైన్ కొలిజన్ సిస్టమ్, అగనంపూడి ఉన్నత పాఠశాల నుంచి కన్జర్వేషన్ ఆఫ్ ఫుడ్ అండ్ వాటర్ ప్రాజెక్టులు ఎంపికయ్యాయి.

రెప్ప వేస్తే.. చెప్పేస్తుంది



నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయిని లక్ష్మి ఆధ్వర్యంలో తరుణ్, యశస్విని ఈ ప్రాజెక్టును తయారు చేశారు. ఇది రోడ్డు ప్రమాదాల నివారణకు ఉపయోగపడుతుంది. ఈ పరికరం వల్ల వాహనం నడుపుతున్నప్పుడు కొంచెం సేపు రెప్ప వేసినా పెద్ద బీప్ శబ్దం వస్తుంది. దీంతో వాహనచోదకుడు వెంటనే అప్రమత్తమవుతాడు. దీని వల్ల ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడవచ్చని విద్యార్థులు తెలిపారు.

నీటి వాడకంలో పొదుపు



గాజువాక మండలం అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయిని ఈ ప్రాజెక్ట్ రూపొందించారు. దీని ద్వారా నీరు వృథా కాకుండా జాగ్రత్త పడవచ్చు. పొదుపు చేసిన నీటిని పెంపుడు జంతువులు, జలచరాలకు ఆహారంగా ఉపయోగించవచ్చని టీచర్ తెలిపారు.

రైతులకు మేలు చేసేలా..



ఈ ప్రాజెక్టును పెందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బి.ఎం.పట్నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థి కె.పూర్ణచంద్ర తయారు చేశాడు. ఇది వ్యవసాయంలో ఉపయోగపడుతుంది. చిన్న కమతాల్లో సైతం దుక్కి దున్నడానికి, విత్తనాలు చల్లడానికి, మొక్కలకు అవసరమైన మేర నీటిని సరఫరా చేయడానికి వినియోగించవచ్చు. నీరు, విత్తనాలు వృథా కాకుండా రైతుకు ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థి తెలిపాడు.

నిర్మాణ రంగంలో గణితం



ఈ ప్రాజెక్ట్‌ను చినగదిలి మండలం శ్రీకృష్ణాపురం గురుకులం గణిత ఉపాధ్యాయుడు బి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థి పి.ఆకాష్ తయారు చేశాడు. దీని ద్వారా ఎక్కడైనా తక్కువ ఖర్చుతో, తక్కువ స్థలంలో నిర్మాణాలు చేపట్టవచ్చు. ఎక్కువ మంది ప్రజలు నివసించే విధంగా గణిత శాస్త్రాన్ని ఉపయోగించి నిర్మాణం చేపట్టవచ్చని విద్యార్థి వివరించాడు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ



మేహాద్రిగెడ్డ బాలికల గురుకులం ఉపాధ్యాయిని కె.రమణమ్మ పర్యవేక్షణలో విద్యార్థులు లోహిత, హిమబిందు ఈ ప్రాజెక్ట్‌ను తయారు చేశారు. దీని ద్వారా ఫార్మాస్యూటికల్ పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవచ్చని విద్యార్థులు తెలిపారు. ఇది సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉంచుతుంది. గ్యాస్ లీకేజీ, ఫైర్ అలారమ్, టెంపరేచర్ మానిటర్లను అప్రమత్తం చేస్తుంది.

ఇలా చేస్తే రైళ్లు ఢీకొట్టవు



ఈ ప్రాజెక్టును చినగదిలి మండలం శ్రీకృష్ణాపురం గురుకులం భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు బి.సీతారాం రూపొందించారు. బహుళ రైళ్లు ఢీకొని ప్రమాదాలు జరగకుండా నివారించడానికి ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. రైలు కూడళ్లలో పట్టాలు దాటుతున్నప్పుడు రైళ్లు ఒకదానికొకటి ఢీకొనకుండా ఈ వ్యవస్థ ద్వారా జాగ్రత్తలు తీసుకోవచ్చని ఉపాధ్యాయులు తెలిపారు.

ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: 2024-25 సంవత్సరానికి ట్రేడ్ అప్రెంటిస్‌షిప్‌ల కోసం అర్హులైన ఐటీఐ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు. వెల్డర్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ తదితర ట్రేడ్‌ల్లో మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాల్లో అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి ట్రేడ్‌కు ఏడాది కాలం పాటు శిక్షణ ఉంటుందని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.8,344.60 నుంచి రూ. 9,387.67 వరకు స్టైఫండ్ చెల్లిస్తామన్నారు. 2024 డిసెంబర్ 31 నాటికి 14 ఏళ్లు నిండిన ఐటీఐ అభ్యర్థులు అర్హులని, ఆసక్తి ఉన్నవారు https:// www. apprenticeshipindia. gov. in ద్వారా ఈ నెల 18 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యే అభ్యర్థులకు పోర్ట్ అథారిటీ ఎలాంటి టీఏ, డీఏ చెల్లించదని చైర్మన్ స్పష్టం చేశారు. ఎస్టీ, ఎస్సీ, ఓబీసీ అభ్యర్థులకు నిబంధనల ప్రకారం రిజర్వేషన్ వర్తిస్తుందని వెల్లడించారు.

స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగాల పేరుతో మోసం

- తండ్రీకొడుకులకు జైలు, జరిమానా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసగించిన కేసులో తండ్రీకొడుకులకు న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు. ఒకేసారి ఐదు కేసుల్లో శిక్ష పడటం చాలా అరుదు అని స్టీల్‌ప్లాంట్ సీఐ కేశవరావు తెలిపారు. కలపాకకు చెందిన స్టీల్‌ప్లాంట్ విశ్రాంతి ఉద్యోగి నగిరెడ్డి పోతయ్య, ఆయన కుమారుడు వెంకటరమణ(కాంట్రాక్ట్ కార్మికుడు) ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి దాదాపు 50 మంది నుంచి రూ.63 లక్షలు వసూలు చేశారు. ఉద్యోగాలు రాకపోవడంతో మోసపోయామని బాధితులు గ్రహించి.. 2017లో స్టీల్‌ప్లాంట్ పోలీస్‌స్టేషన్‌లో తండ్రీకొడుకులపై ఫిర్యాదు చేశారు. గాజువాక అడిషనల్ చీఫ్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ వై.శ్రీలక్ష్మి 50 మంది సాక్షులను విచారించి తండ్రీకొడుకులిద్దరికీ మూడేళ్ల జైలు శిక్ష, ఒక్కో కేసులో రూ.10 వేల చొప్పున మొత్తం రూ.50 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 9 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో శుక్రవారం నిర్వహించిన టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 9 వినతులు వచ్చాయి. సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు ఓపెన్ ఫోరం నిర్వహించగా.. జోన్-2 నుంచి ఒకటి, జోన్-3 నుంచి 2, జోన్-4 నుంచి ఒకటి, జోన్-6 నుంచి ఒకటి, జోన్-8 నుంచి నాలుగు వినతులు వచ్చాయి. వీటిని నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

అభివృద్ధి పనులకు 'స్థాయీ సంఘం' ఆమోదం



మాట్లాడుతున్న మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ కార్యాలయంలో శుక్రవారం స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ స్థాయీ సంఘ సమావేశంలో 42 అంశాలు పొందుపరిచారన్నారు. వాటిని సభ్యులు చర్చించి ఒక అంశాన్ని వాయిదా వేయగా, మిగిలిన 41 అంశాలు ఆమోదం పొందాయన్నారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగంలో అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలున్నాయని, వాటిని చర్చించి సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. సమావేశంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, కార్యనిర్వాహక ఇంజినీర్లు శ్రీధర్, ఎస్ చిరంజీవి, ఏఎంఓహెచ్‌లు డాక్టర్ ఎన్ కిశోర్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ ప్రారంభం



పరుగు పోటీలో పాల్గొన్న మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులు

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో కానిస్టేబుల్ ఎంపిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం మహిళా అభ్యర్థులకు శరీర దారుఢ్య పరీక్షలు ప్రారంభించారు. 718 మంది అభ్యర్థులకు గాను 278 మంది హాజరయ్యారు. అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా పర్యవేక్షణలో పోలీస్ అధికారులు అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. అనంతరం బయోమెట్రిక్, బ్యాగేజ్ కౌంటర్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ (పీఎంటీ), ఫిజికల్ ఎఫీషియెన్సీ టెస్ట్ (పీఈటీ), పరుగు పోటీలు నిర్వహించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ నెల 6 వరకు మహిళా అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ఉత్సాహంగా సాగుతోంది. పోటీల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అథ్లెటిక్స్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో తదితర పోటీలు నిర్వహించారు. శనివారం ముగింపు సందర్భంగా విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు.

ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్.. నిందితుడి అరెస్ట్

గోపాలపట్నం: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురానికి చెందిన ఎ.అవినాష్ కేటరింగ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. అతను కొంతమంది వ్యక్తులతో కలిసి ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లు చేస్తున్నాడు. ఈ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రాత్రి అవినాష్‌ను అదుపు లోకి తీసుకుని గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో అవినాష్‌పై కేసు నమోదు చేశారు. ఈ కేసులో మరికొంత మందికి సంబంధం ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వారు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు సమాచారం.

'జేసీపై మహిళా కమిషన్ చర్యలు తీసుకోవాలి'

సీతమ్మధార: తాడిపత్రిలో జేసీ ఈవెంట్స్ నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలకు మహిళలు వెళ్లవద్దని సూచించిన సినీనటి మాధవీలతపై లేనిపోని అభాండాలు మోపి.. జేసీ ప్రభాకర్‌రెడ్డి తీవ్రంగా అవమానించారని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ ఎస్ఎల్ఎన్ వాసు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనిపై జాతీయ మహిళా కమిషన్ తక్షణమే స్పందించి జేసీ ప్రభాకర్‌రెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. బాధ్యత గల ప్రజాప్రతినిధిగా ఉంటూ మహిళను ఇంతటి నీచంగా మాట్లాడిన జేసీపై సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏపీలో ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

డాబాగార్డెన్స్: ఎస్సీ వర్గీకరణ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింతా మోహన్ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు తప్పని, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పక్కనే ఉన్న ఏపీ కంటే పెద్ద రాష్ట్రమైన తమిళనాడులో ముఖ్యమంత్రి స్టాలిన్, కేరళలో సీఎం విజయన్‌కు లేని ఆలోచన ఏపీలో ఎందుకొచ్చిందని మండిపడ్డారు. 'చంద్రబాబూ నువ్వు తప్పు చేస్తున్నావ్.. చేసిన తప్పులు సరి చేసుకో..' అంటూ చింతా హెచ్చరించారు. రాష్ట్రంలో ఎస్సీలు కన్నీళ్లతో ఉన్నారని, విశాఖ నుంచే రోడ్లపైకి ఎస్సీలు రాబోతున్నారన్నారు. శనివారం విశాఖకు వస్తున్న చంద్రబాబు ఎస్సీ వర్గీకరణపై స్పందించాలని కోరారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని చింతా తెలిపారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నిలబెట్టేందుకు చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ వల్లే ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్రంలోనూ, హర్యానా, మహారాష్ట్రలో ఆయా పార్టీలు అధికారంలోకి వచ్చాయని చింతా ఆరోపించారు.

విశాఖలో బౌండరీల మోత

విశాఖ స్పోర్ట్స్: విజయ్ హజారే ట్రోఫీ గ్రూప్ డీ పోటీల్లో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో బౌండరీల మోత మోగింది. జమ్ముకశ్మీర్, ఛత్తీస్‌గఢ్ జట్లు భారీ స్కోర్లు చేయగా.. ముగ్గురు బ్యాటర్లు సెంచరీలు చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఛత్తీస్‌గఢ్ చేతిలో టాస్ ఓడి జమ్ము కశ్మీర్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 50 ఓవర్లలో మరో 15 బంతులు ఉండగానే ఆలౌట్ అయి 337 పరుగులు చేసింది. ఓపెనర్ శుభమ్ ఖజూరియా 159 పరుగులతో జట్టు భారీ స్కోర్ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. తొలి వికెట్‌కు ఓపెనర్ విబ్రాంత్ శర్మ(42)తో కలిసి 100 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. 20 ఫోర్లు, 5 సిక్సర్లు బాదిన శుభమ్ అనూహ్యంగా రనౌట్ అయ్యాడు. కెప్టెన్ డోగ్రా నాలుగు పరుగులకే పెవిలియన్‌కు చేరగా, అజాజ్ 27, అబిద్ 30, నాజిర్ 32 పరుగులతో రాణించారు. రవికిరణ్ మూడు, గగన్‌దీప్, హర్ష రెండేసి వికెట్లు తీశారు. 338 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఛత్తీస్‌గఢ్ మరో 9 బంతులు ఉండగానే విజయాన్ని అందుకుంది. ఓపెనర్ అశుతోష్ 127, వన్‌డౌన్‌లో వచ్చిన సంజీత్ 128 పరుగులు చేశారు. వీరి జోడి రెండో వికెట్‌కు ఏకంగా 228 పరుగులు జోడించింది. యాదవ్ 51 పరుగులు చేశాడు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ బాగ్చి తదితరులు

మహారాణిపేట: సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలేకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఘన నివాళులు అర్పించారు. ఆమె జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజానికి ఆమె అందించిన సేవలను కొనియాడారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, సీపీ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీల కో-ఆర్డినేటర్‌గా శ్రీను



ఉక్కునగరం: జాతీయ బాక్సింగ్ పోటీల కో-ఆర్డినేటర్‌గా స్టీల్‌ప్లాంట్‌కు చెందిన కడియాల శ్రీనివాసరావు(బాక్సర్ శ్రీను) నియమితులయ్యారు. బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 13 వరకు ఉత్తరప్రదేశ్‌లో జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్ జరగనుంది. ఈ పోటీల్లో శ్రీనివాసరావు రిఫరీ, జడ్జిలకు కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు ఆయనకు బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి అధికారిక సమాచారం అందింది. ఆయన శనివారం విశాఖ నుంచి బయలుదేరి ఉత్తరప్రదేశ్ వెళ్లనున్నారు.

రెవెన్యూ సదస్సు బహిష్కరణ



నిరసన వ్యక్తం చేస్తున్న శింగనబంధ రైతులు

తగరపువలస: రెవెన్యూ అధికారుల తీరుకు నిరసనగా భీమిలి మండలం శింగనబంధ పంచాయతీ రైతులు శుక్రవారం జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సును బహిష్కరించారు. ఉదయం 9 గంటలకు సభ ఉందని సమాచారం అందించిన వీఆర్వో 9.30కు, ఆర్ఐ 11.30కు, డీటీ 12 గంటలకు ధీమాగా వచ్చారు. పంచాయతీ పరిధిలోని ఒకరి భూమి మరొకరి పేరుమీద రావడం, ఒక ఎల్‌పీఎం నంబర్ పలువురి రైతులకు రావడంతో గందరగోళ పరిస్థితులు ఉన్నాయి. ఈ అంశాలు పరిష్కరించేందుకు సదస్సుకు భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్, తహసీల్దార్ పి.రామారావు రావాలని, అప్పటి వరకు సదస్సు వాయిదా వేయాలని రైతులు, ప్రజాప్రతినిధులు కోరారు. ఇక్కడి రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఏదో ఒక కారణం చెప్పి తిప్పుతున్నారని, ఇదే పంచాయతీ పరిధిలోని రియల్ ఎస్టేట్ యాజమానులకు క్షణాలపై పనులు చేసి పెడుతున్నారని ఆరోపించారు. గతేడాది నవంబర్ 2న నిర్వహించిన గ్రామసభలో స్వీకరించిన దరఖాస్తుల్లో ఒక్కటి కూడా ఇప్పటి వరకు పరిష్కరించలేదన్నారు. ఆర్డీవో, తహసీల్దార్ వచ్చిన తర్వాత సదస్సు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ.. రైతులతో సహా సర్పంచ్ గాడు వెంకటనారాయణ, భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, ఎంపీటీసీ సభ్యుడు తుపాకుల పైడిరాజు, గాడు తాతినాయుడు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న భీమిలి తహసీల్దార్ రామారావు అక్కడకు వచ్చి.. ఉన్న రైతులతో సదస్సు నిర్వహించారు. 22ఎ, అడంగల్, భూఆక్రమణలకు సంబంధించి చేసుకున్న దరఖాస్తులకు పరిష్కారం చూపుతామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు.